క్లుప్తంగా

ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు ప్రారంభం

మదనపల్లె సిటీ: వేసవి సెలవులకు పురస్కరించుకుని ఏబీవీపీ, ఏపీయూఎస్ ఆధ్వర్యంలో స్థానిక వికాస్ జూనియర్ కాలేజీలో బుధవారం ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు ప్రారంభించారు. అపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులలో సమయం వృథా చేసుకోకుండా స్పోకెన్ ఇంగ్లిషు తరగతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కన్వీనర్ సాయి హితేష్, జనార్దన్, సిద్దారెడ్డి, రాజు, సాయిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రీజనల్ స్థాయిలో ఆదాయంలో ప్రథమ స్థానం

మదనపల్లె సిటీ: ఆర్టీసీ రీజనల్ స్థాయిలో మదనపల్లె -1 డిపో అన్ని విభాగాల్లో మొదటి స్థానం నిలిచిందని డిఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఏప్రిల్ నెలలో ఈపీకెలో 44.15, ఓఆర్ 81.73 వచ్చిందన్నారు. 567.48 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. 5.50 కెఎంపిఎల్ వచ్చిందన్నారు. సిబ్బంది సహాయ సహకారాలతో మొదటి స్థానం నిలిచిందన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టుల్లో తనిఖీలు

బి.కొత్తకోట: కర్ణాటక సరిహద్దులోని చెక్‌పోస్టులను నియోజకవర్గ ఎన్నికల ఎంసీసీ నోడల్ అధికారి పీఆర్.మనోహర్ బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. బి.కొత్తకోట మండలం తానామిట్ట, పెద్దతిప్పసముద్రం మండలం కానుగమాకులపల్లె, ములకలచెరువు మండలం ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విధుల్లోని సిబ్బంది పనితీరును పరిశీలించారు. వాహనాల తనిఖీలు, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. అక్రమ మద్యంపై నిఘా పటిష్టంగా ఉండాలన్నారు. అనుమానితుల వివరాలను సేకరించాలని కోరారు. చెక్‌పోస్టుల్లోని రికార్డులను, తనిఖీల సమాచారం పరిశీలించారు.

భాస్కర్‌రెడ్డి సేవలు ప్రశంసనీయం


భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్టీయూ నేతలు

మదనపల్లె సిటీ: విద్యారంగానికి ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి సేవలు ప్రశంసనీయమని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మిషన్‌కాంపౌండ్‌లో ఫంక్షన్ హాలులో భాస్కర్ రెడ్డి పదవీ విరమణ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాతూ ఆయన పని చేసిన పాఠశాలల్లో ప్రతి ఏడాది విద్యార్థులకు అవసరమైన విద్యాసామాగ్రిని అందజేశారన్నారు. ఎస్టీయూ సంఘ నాయకుడిగా ఎన్నో సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు పద్మావతి, నారాయణ, రెడ్డన్నశెట్టి, ఎస్టీయూ నాయకులు మురళి, శివారెడ్డి, పోకల మధుసూధన్, ఆర్‌వి రమణ పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన


మాట్లాడుతున్న జడ్జి ఉమర్‌ఫరూఖ్

తంబళ్లపల్లె: రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన ముఖ్యమని మండల న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్, స్థానిక న్యాయమూర్తి ఉమ్మర్‌ఫరూఖ్ తెలిపారు. బుధవారం టిఎస్ వెంకటాసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో కార్మిక దినోత్సవ సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. కార్మిక చట్టాలు, బాలల హక్కులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు దుర అలవాట్లకు బానిసకాకుండా ఉన్నత చదువులతో మంచి స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమండ్యం.. ప్రగతిలో ప్రభంజనం

- రూ.63 కోట్లతో ప్రతిపల్లెకు తారురోడ్డు ఏర్పాటు
- పెద్దేరు నదిపై రూ. కోటితో బ్రిడ్జి నిర్మాణం
- ప్రజల ముంగిటకే సంక్షేమం, అభివృద్ధి



ఆధునీకరించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పెద్దమండ్యం : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఒకప్పుడు సరిహద్దు మండలం.. అటు వైఎస్సార్ కడప జిల్లా, ఇటు అనంతపురం జిల్లాలకు పక్కనే ఉంటుంది.. అప్పటి జిల్లా కేంద్రమైన చిత్తూరుకు వెళ్లాలంటే 140 కిలో మీటర్ల ప్రయాణం.. ఇలా మారుమూల ప్రాంతమైన పెద్దమండ్యం మండలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పరుగులు పెట్టింది. ప్రజల ముంగిటకే ప్రజాసేవలు.. విద్యాలయాలకు కొత్తశోభ.. ఇంటి దగ్గరికే ఉచిత వైద్యం.. గ్రామంలోనే కొలువు దీరిన సచివాలయాలు.. పక్కనే ఆర్‌బికేలు.. ఇలా పెద్ద మండ్యం మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు చేరువ కావడం ఇదే మొదటిసారి కావచ్చు..

రూ. 63 కోట్లతో తారు రోడ్ల నిర్మాణం

మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో ఉన్న పల్లెలకు 52 పనులకు గాను రూ.63 కోట్లతో తారురోడ్లు ఏర్పాటు ఏర్పాటు చేశారు. సీ గొల్లపల్లె, పాపేపల్లె అంతర్‌జిల్లా రోడ్లు ఎంతో కాలంగా మట్టిరోడ్లుగానే ఉండేవి. పాపేపల్లె నుండి వైఎస్సార్‌జిల్లాలోని గాలివీడు మండలంలోని గోరానిచెరువుకు కలుపుతూ తారురోడ్డు ఏర్పాటుతో ప్రజల రాకపోకలకు సులువైంది. అలాగే రెక్కలకొండ పల్లె, బోదగుంటపల్లె, నక్కలవారికోట, చింతమానువారిపల్లె, జిల్లావాండ్లపల్లె, బురుజుకురవపల్లె, నడింబురుజు, కుడుములవారిపల్లె, కాయలపల్లె, యర్రగుట్టపల్లె, కనుమలోపల్లెలకు తారురోడ్లు ఏర్పాటు చేశారు. 6.5 కోట్లతో సిమెంటు రోడ్ల ఏర్పాటుతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తీరిన గిరిజనుల చిరకాల కోరిక

మండలంలో 17 గిరిజన తండాలు ఉన్నాయి. ఇందులో మండలవారిపల్లె, దిగువపల్లె, అవికేనాయక్ తండా పంచాయతీలలో ఉన్న గిరిజన తండాలు పెద్దేరు నది ఒడ్డున ఉన్నాయి. పెద్దేరు నది ప్రవహిస్తే మండల కేంద్రానికి రావాలంటే గిరిజనులు అవస్థలు పడేవారు. ఈ క్రమంలో వడ్డివంకతండాకు సమీపంలో పెద్దేరు నదిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. రూ. ఒక కోటి వ్యయంతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో గిరిజనుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పోయింది.

ప్రజల ముంగిటకే పౌరసేవలు

మండలంలో 11 గ్రామ సచివాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సచివాలయాల ఏర్పాటుతో పౌర సేవలు ప్రజల ముంగిటకు చేరుకున్నాయి. అలాగే 11 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో ఎరువుల కోసం రైతులు మండల కేంద్రానికి వచ్చే పరిస్థితి లేదు. సచివాలయాలు, ఆర్‌బికేల నిర్మాణం కోసం రూ. 9.5 కోట్లు ఖర్చు చేశారు. ప్రజలు తమ అవసరాల కోసం మండల కేంద్రానికి వ్యయప్రయాసలు పడి వచ్చేవారు. సచివాలయాలు, ఆర్‌బికేల ఏర్పాటుతో ప్రజల ముగిటకే ప్రభుత్వ సేవలు అందించడం ప్రజలకు ఆనందాన్నిస్తోంది.

విద్యా, వైద్యానికి పెద్దపీట :

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు నాడు-నేడు ద్వారా రూపు రేఖలను మారిపోయాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌళిక వసతులు కల్పించారు. మండలంలోని మోడల్ పాఠశాల పట్టణాలలో ఉన్న కార్పొరేట్ పాఠశాలను తలపిస్తోంది. ఈ పాఠశాలలో ప్రతి ఏడాది 600 ల మంది పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో ప్రవేశం కోసం విద్యార్థులు పోటీ పడే పరిస్థితి నెలకొంది. ఇంగ్లీసు మీడియంలో విద్యాబోధన, జగనన్న గోరుముద్దతో నాణ్యమైన భోజనం, విద్యాకానుక ద్వారా ప్రతి విద్యార్థికి పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాంను ప్రభుత్వం అందిస్తోంది. అలాగే పెద్దమండ్యం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆధునీకరించారు. 24 గంటలు రోగులకు వైద్య సేవలను అందించేందుకు డాక్టర్‌లు, సిబ్బందిని ఏర్పాటు చేశారు.

ప్రజలకు లబ్ధి రూ. 223 కోట్లు

మండలంలోని 11 సచివాలయాల ద్వారా ఐదు సంవత్సరాల కాలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా రూ.223 కోట్లు జమ చేసింది. ప్రత్యక్ష, పరోక్ష నగదు బదిలీల ద్వారా అర్హులైన కుటుంబాలకు వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూరింది. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా మండలంలోని ప్రజలకు ఈ స్థాయిలో లబ్ధి కలగడం ఇదే మొదటిసారి. మారుమూల ప్రాంతంగా పేరున్న పెద్దమండ్యం మండలంలో గతంలో ఎన్నడూ చూడని విధంగా సంక్షేమం, అభివృద్ధి జరగడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పెద్దేరు నదిపై నిర్మించిన బ్రిడ్జి


బుసిరెడ్డిగారిపల్లెకు ఏర్పాటు చేసిన రోడ్డు


కార్పొరేట్ పాఠశాలను తలపిస్తున్న మోడల్ పాఠశాల


వెలిగల్లు గ్రామ సచివాలయం


బండమీదపల్లె రైతు భరోసా కేంద్రం

సంక్షేమ పాలనను ఆదరించండి

- అగ్రహారం, తవళం పంచాయతీలో ఎన్నికల ప్రచారం
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్

నిమ్మనపల్లె : రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి పాలనను ఆదరించి , రానున్న ఎన్నికల్లోనూ సీఎం జగనన్ననే మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని అగ్రహారం, తవళం గ్రామ పంచాయతీలలోని తవళం, కుమ్మరపల్లి, చౌకిల్లవారిపల్లె, అగ్రహారం, రెడ్డివారిపల్లె తదితర గ్రామాల్లో మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ సదాశివరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మేపల్లి శ్రీనివాసులు రెడ్డి, ఆర్.బి.కె చైర్మన్ ప్రవీణ్ కుమార్ రెడ్డి సింగల్ విండో అధ్యక్షుడు రెడ్డి శేఖర్ రెడ్డి, ఎంపీపీ నరసింహులు, సర్పంచ్ ఉషారాణి, ఎంపీటీసీ కుసుమకుమారి,నాయకులు యుగంధర్ రెడ్డి, రమణారెడ్డి, రఘునాథ రెడ్డి లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. స్థానికుల విన్నపం మేరకు ఎన్నికల్లో గెలిచిన వెంటనే మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, రాష్ట్రం లోని అన్ని ప్రాంతాలు, అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందేలా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఇదే అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే, మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో అందరు ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. ఎన్నికల వేళ మాయమాటలు చెప్పే టీడీపీ నేతలను నమ్మవద్దన్నారు. రాజంపేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న నిసార్ అహ్మద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో దయాకర్ రెడ్డి ఉదయ శేఖర్ రెడ్డి మోహన్ రెడ్డి రామారావు సుధాకర, రెడ్డిభాస్కర గంగాధర, శంకర, రవి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అన్ని వర్గాల అభివృద్ధి


ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని కోరుతున్న పెద్దిరెడ్డి కవితమ్మ


పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న పెద్దిరెడ్డి కవితమ్మ

తంబళ్లపల్లె: రాష్ట్రంలో అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందాలంటే మళ్లీ జగనన్న సీయం కావాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ తెలిపారు. బుధవారం మండలంలోని కన్నెమడుగు, మర్రిమాకులపల్లె పంచాయితీలో సర్పంచులు శ్యామలమ్మ, కె.జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు మహేష్, రామక్రిష్ణారెడ్డి, రవిశంకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగింది. ప్రతి పల్లెలోనూ జరిగిన అభివృద్ధికి కళ్లకు కట్టినట్లు కనిపిస్తోందన్నారు. మరింత అభివృద్ధి కోసం రాజంపేట ఎంపీ అభ్యర్థిగా మిథున్‌రెడ్డికి, ఎమ్మెల్యే అభ్యర్థిగా పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలపించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రపద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, ఎంపీపీ అనసూయమ్మ, మండల కన్వీనర్ చౌడేశ్వర్, మల్లయ్యకొండ చైర్మన్ మల్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్‌భార్గవరెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రామశంకర్‌రెడ్డి, శివారెడ్డి, జమాల్‌బాషా, రామూర్తి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు

ఇంటింటా ప్రచారంలో టీడీపీ నాయకులు స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. బుధవారం జరిగిన ప్రచార కార్యక్రమంలో రెడ్డివారిపల్లెకు చెందిన చెన్నారెడ్డి, లక్ష్మీపురంకు చెందిన పురుషోత్తం నాయుడు టీడీపీ నుండి వైఎస్సార్‌సీపీలో చేరారు. కవితమ్మ పార్టీ కండువాలతో స్వాగతించారు.

వాడవాడలా కార్మిక దినోత్సవ వేడుకలు



మదనపల్లెలో మేడే ప్రదర్శనలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ, బహుజనసేన సభ్యులు


బి.కొత్తకోటలో కార్మిక జెండా ఏగురవేస్తున్న దృశ్యం

మదనపల్లె : కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్లు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వాడవాడలా ప్రపంచ కార్మికదినోత్సవాన్ని నిర్వహించారు. మేడే స్ఫూర్తితో కార్మిక హక్కులను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ, బహుజనసేన ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట జెండాను ఎగురవేసి వందన సమర్పణ గావించారు. అనంతరం కార్మికులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ కార్యాలయం వద్ద జిల్లా కోశాధికారి తెలకపల్లె హరీంద్రనాథ్‌శర్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మేడే జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. కార్మికచట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిన బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం, మెరుగైన వేతనాలకై, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చికాగో పోరాట స్ఫూర్తితో ముందడగు వేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వత్రి సురేష్‌కుమార్, బహుజన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, వాసు, పృథ్వీరాజు, లోకేష్, శ్రీనివాసులు, సాంబశివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో మేడే ర్యాలీ

బి.కొత్తకోట: కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకుని బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. పీటీఎంరోడ్డులో పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జ్యోతిచౌక్ నుంచి మెయిన్‌రోడ్డు, దిగువబస్టాండ్, బైపాస్‌రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల కారణంగా కార్మికులు నష్టపోతున్నారని అన్నారు. దీనిపై కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఎస్.బషీర్‌ఖాన్, తంబయ్యశెట్టి, రఘునాథ్, సమీవుల్లా, నారాయణస్వామి, కృష్ణారెడ్డి, ఖాదర్‌వలీ పాల్గొన్నారు. కాగా దిగువబస్టాండ్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి సలీంబాషా, నియోజకవర్గ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డిలు పతాకాన్ని ఏగురవేశారు. కార్మికుల పక్షాన పోరాటాలు సాగిస్తూ ఏఐటీయూసీ అండగా నిలుస్తోందని అన్నారు. చౌడప్ప, రామాంజనేయులు, నసీబ్, గోపాళ్, బాబాజాన్, ఖాదర్‌వలీ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి


అరికెలలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహమ్మద్, డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి

రామసముద్రం: వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహమ్మద్ ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని అరికెల, మానేవారిపల్లె పంచాయతీల్లో నాయకులు జయరామిరెడ్డి, ఎంపీటీసీ రమణారెడ్డి, సర్పంచ్ బాలప్పల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయి తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డిలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా నిస్సార్ అహమ్మద్‌ను, ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. నిస్సార్ అహమ్మద్ గడప గడపకు వెళ్లి అవ్వ, తాత, అన్న, తమ్ముడు అంటు ఆప్యాయంగా పలకరిస్తూ ఎన్నికల్లో తనను ఆదరించాలని కోరారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయని , సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు కేశవరెడ్డి, వైస్ ఎంపీపీ రమణారెడ్డి, సిబికె సచివాలయం కన్వీనర్ శ్రీనివాసులు, చిప్పిలి జగన్నాథరెడ్డి, నంద, మస్తాన్, ప్రకాష్, గెవన్న, అంజిరెడ్డి, బుడ్డారెడ్డి, సదుం రవీంద్ర, హైదర్‌వల్లి, మస్తాన్, బిసి సెల్ బాలాజీ, అమరనాథరెడ్డి, కోఆప్షన్ షంషీర్, రత్నారెడ్డి, మయూరి, రఘునాథరెడ్డి, రామాంజులు, శివ, శ్రీనివాసులురెడ్డి, కృష్ణప్ప, రెడ్డివీరేగౌడు, మెకానిక్ వెంకటేష్, జెబి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి


కాట్నగల్లు పంచాయతీలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పెద్దతిప్పసముద్రం: పార్టీలకతీతంగా మంజూరవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజా ప్రతినిధులు, నాయకులు కోరారు. బుధవారం మండలంలోని కాట్నగల్లు పంచాయతీలో వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జగనన్న పాలనలో జరిగిన సంక్షేమాభివృద్ధిని ఓటర్లకు వివరిస్తూ ముందుకు సాగారు. రాజంపేట ఎంపీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని, తంబళ్ళపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఇప్పటికే గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారని ప్రజలకు గుర్తు చేశారు. మళ్ళీ జగనన్న నేతత్వంలో సువర్ణ పాలన రావాలంటే సమష్టిగా ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కూటమి అభ్యర్థులు ఆచరణకు సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్య పెట్టేందుకు ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని, అలాంటి నాయకుల మాటలు నమ్మి మోసపోరాదని ప్రజలకు హితవు పలికారు. ప్రచారంలో మహమూద్, శివన్న, గణపతిరెడ్డి, డ్రిప్ రమణ, సుబ్బరాం, శోభా, శంకర్, కుమార్‌రెడ్డి, అనిత, మొరుంపల్లి భాస్కర్‌రెడ్డి, సందీప్,దిలీప్‌రెడ్డి, లక్ష్మీకర్‌రెడ్డి, రాఘవేంద్ర,హరీష్, శివారెడ్డి, కుంచే శ్రీనివాస్, సురేంద్రరెడ్డి, సుబ్బారెడ్డి, ఖాదర్‌వలి, పూల గిరీష్, ఉత్తన్న, పీఎస్ మధు, కార్యం చంద్ర, గిరీస్వామి, భాస్కర్‌నాయుడు, సుబ్బిరెడ్డి, వెంకటరెడ్డి, సాదిక్, కేఎన్ శ్రీనివాస్, రవికుమార్, మహబూబ్ బాషా, మంజునాథ్‌రెడ్డి, రాఘవ, రఘునాథ్‌రెడ్డి, మధు, రాజశేఖర్ , కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను ప్రోత్సహిద్దాం

మదనపల్లె : ఆడపిల్లలు అన్నిరంగాల్లో రాణించేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని, సమాజంలో ఎదురయ్యే ప్రతి సమస్యను ఎదుర్కొనే విధంగా తయారవ్వాలని రిటైర్డ్ రెవెన్యూ అధికారి చిప్పిలి జగన్నాథరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఈశ్వరమ్మకాలనీలో.. ఇటీవల వెలువడిన పదోతరగతి పరీక్షా ఫలితాల్లో 600 మార్కులకు 597 సాధించి, రాష్ట్రస్థాయిలో మూడోర్యాంకు సాధించిన విద్యార్థిని జానం శ్రావణిని అభినందించారు. క్రమశిక్షణతో కష్టపడి చదివి, రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించడంపై విద్యార్థినికి ఆశీస్సులను అందజేశారు. భవిష్యత్తులోనూ ఇలాగే ఉత్తమ ప్రతిభ కనపరిచి, తల్లిదండ్రుల కలలను నిజం చేసేలా ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థినికి ప్రోత్సాహకంగా రూ.21వేల నగదును అందించారు. తన కూతురు మధులత...చక్కగా చదువుకుని, ప్రస్తుతం చెన్నైలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ అధికారిగా పనిచేస్తోందన్నారు. పిల్లలకు చదువు ఒక్కటే తల్లిదండ్రులు ఇవ్వగలిగిన ఆస్తి అన్నారు. ఆడపిల్ల ఉన్న ఇల్లు కళకళలాడుతూ ఉంటుందని, లింగవివక్ష చూపకుండా అన్ని రంగాల్లో ఎదిగేలా తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు


వైఎస్సార్ సీపీకి ఓటువేయాలని ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : వైఎస్సార్ సీపీ ఐదేళ్ల ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకం అందిందని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. పట్టణంలోని 26, 31 వార్డుల్లోని సొసైటీకాలనీ, కురవంకలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కౌన్సిలర్ సింధలూరి రజని, నరిబాబాయ్ తదితరులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రచార కరపత్రాలను పంచుతూ, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. అర్హతే ప్రామాణికంగా వివక్ష చూపకుండా సంక్షేమ పథకాలు అమలుచేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ తప్పకుండా అమలుచేసి చూపించిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవడం ద్వారా రాష్ట్రంలో సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ రెండు ఓట్లను రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్‌కు ఫ్యాన్‌గుర్తుపై వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిందిగా కోరారు.